

మహాసభలో మాట్లాడుతున్న వీరయ్య

ఎంతటి నియంతలైనా గద్దె దిగాల్సిందే..

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య
- ఉత్సాహభరితంగా సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికవర్గం సంఘటితంగా తిరగబడితే ఎంతటి నియంతలైనా గద్దె దిగాల్సిందేనని, ఇటీవల ప్రపంచ వ్యాప్తంగా జరిగే పరిణామాలను చూస్తే అది అర్థం అవుతుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మల్లికార్జున ఫంక్షన్‌హాల్‌లో శనివారం సిఐటియు జిల్లా 4వ మహాసభ ఉత్సాహభరితంగా జరిగింది. వివిధ రంగాల నుంచి 300 మంది కార్మిక ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రారంభానికిరంగా అరుణపతాకాన్ని జిల్లా అధ్యక్షులు దాసరి పాండు ఆవిష్కరించారు. నాయకత్వం, ప్రతినిధులు అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం ఎస్ వీరయ్య మాట్లాడుతూ ప్రపంచాన్ని ఆయుధ సంపత్తితో శాసిస్తున్న అమెరికాలోని న్యూయార్క్ నగరంలో కార్మికుల పక్షపాతి, జోహ్రాన్ మమ్దాని విజయం, ఇటీవల శ్రీలంక ఎన్నికల్లో దిసనాయకే విజయం పెట్టుబడిదారులకు చెంపపెట్టు లాంటిదన్నారు. భారతదేశంలో బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లు తెచ్చి హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. దేశాన్ని ఆదానీ - అంబానీలకు తాకట్టు పెడుతోందన్నారు. న్యూయార్క్, శ్రీలంక ప్రజల స్ఫూర్తితో కార్మికవర్గం మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి భూపాల్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, నాయకులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గొరిగె సోములు, ఎండి పాషా పాల్గొన్నారు.

11న ఆర్‌టిసి జెఎసి ఆవిర్భావం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిజిఎస్ ఆర్‌టిసిలో జెఎసి ఏర్పాటు చేయాలని ఉద్యోగ కార్మిక సంఘాలు నిర్ణయించుకున్నాయి. కలిసికట్టుగా సర్కారుపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని భావిస్తున్నాయి. ఈ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయా సంఘాల నేతలు తెలిపారు. హైదరాబాద్ ఆజామాబాద్‌లోని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సంఘాల ప్రధాన నాయకులు సమావేశమై జెఎసి ఏర్పాటుపై మంతనాలు చేశారు. ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటిగౌడ్ (ఇయు), కమలాకర్‌గౌడ్ (టిఎంయు), కత్తుల యాదయ్య (బికెయు), జివికె యాదవ్ (బిడబ్ల్యుయు), యాదగిరి (కెపి) తదితరులు పాల్గొని చర్చించారు. ఈ నెల 11న టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి ఆవిర్భావం కానుందని చెప్పారు. నూతన కమిటీ ఏర్పాటు, భవిష్యత్తులో చేపట్టే ఉద్యమాలకు ఉమ్మడి కార్యాచరణ ప్రకటించనున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ఆర్‌టిసి ఉనికికి, కార్మికుల భద్రత, ప్రయివేటు ఎలక్ట్రిక్ బస్సులతో ప్రమాదాలు ముంచుకొస్తున్నాయని గుర్తు చేశారు. అందుకోసం జెఎసితో వచ్చే సంఘాలను కలుపుకొని ప్రభు త్వంపై పోరాటాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు బాల్‌రెడ్డి, రాఘవులు, రామిరెడ్డి, యాదయ్య, బుద్ధ విశాల్, రాములు, సుద్దాల సురేష్, రామచంద్రం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.ఈ మేరకు శనివారం ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు.

లౌకికవాద పునాదులపై ఏర్పడిన కాంగ్రెస్

- నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపిద్దాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సిఎం రేవంత్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డిప్యూటీ సిఎం

కాంగ్రెస్ పార్టీ లౌకికవాద పునాదుల మీద ఏర్పడిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడం కోసం కాంగ్రెస్ పని చేస్తున్నదన్నారు. హైదరాబాద్‌లోని ఫిలిం కల్చరల్ క్లబ్‌లో శనివారం క్రైస్తవ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్‌ను ఆశీర్వదించి, దీవించడం కోసం ఇక్కడకు వచ్చిన పాస్టర్లకు, క్రైస్తవ సంఘ ప్రతినిధులకు ధన్యవాదాలు చెప్పారు. పేదరికంలో ఉన్న ప్రతి వ్యక్తీ ఉన్నత స్థాయికి ఎదగడం కోసం.. వారిని ముందుకు నడిపించడం కోసం కాంగ్రెస్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేయాలని కోరారు. నవీన్‌ను గెలిపించి ఈ ప్రభుత్వాన్ని దీవించి ముందుకు నడిపించాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు.

సిఎం రేవంత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ

- ఎక్స్ వేదికగా విషెస్ తెలిపిన ప్రధాని మోడీ, రాహుల్
- పలువురు సిఎంలు, సినీ ప్రముఖుల అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. రేవంత్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, కర్ణాటక సిఎం సిద్దరామయ్య, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా సిఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బర్త్‌డే విషెస్ తెలిపారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్న సిఎం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కేంద్ర మంత్రులు రాంమోహన్ నాయుడు, బండి సంజయ్‌లు బర్త్‌డే విషెస్ తెలిపారు. నారా లోకేష్, సచిన్ పైలట్, కనిమొళి, ఉదయనిధి స్టాలిన్, రాష్ట్ర మంత్రులు దనసరి అనసూయ సీతక్క, జూపల్లి కృష్ణారావు తదితరులు రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

సినీ ప్రముఖుల విషెస్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పలువురు సినీ ప్రముఖులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. చిరంజీవి, అజయ్ దేవ్‌గన్, రాంచరణ్, జూనియర్ ఎన్‌టిఆర్ ఎక్స్ వేదికగా విషెస్ తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు మరింత సేవ చేసే శక్తి కలగాలని పేర్కొన్నారు.

బిసి రిజర్వేషన్లకు మద్దతివ్వండి

- సిపిఎంను కోరిన ఒయు బిసి జెఎసి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

42 శాతం బిసి రిజర్వేషన్ల సాధానకోసం అన్ని రాజకీయ పార్టీల మద్దతు కోరే కార్యక్రమంలో భాగంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీని శనివారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో ఒయు బిసి జెఎసి బృందం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. బిసి రిజర్వేషన్ల సాధన కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. బిసి కులాలకు రిజర్వేషన్లు లేకపోవడంతో చట్ట సభలలోకి వెళ్లే అవకాశం కోల్పోతున్నామని తెలిపారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. వెనుకబడిన కులాల జనాభా ఉండి రాజకీయ ప్రాతి నిధ్యం లేక చరిత్రలో కనుమరుగయ్యే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్గాల అభ్యున్నతి కోసం జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించే బాధ్యత అధికారంలో ఉన్న పాలకులపై ఉందని, 42 శాతం బిసి కులాల రిజర్వేషన్ల బిల్లును కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలనే డిమాండ్‌తో ఒత్తిడి తేవాలని కోరారు. ఒయులో జరుగుతున్న బిసి ఉద్యమాలకు, భవిష్యత్ కార్యాచరణకు మద్దతుంటుందని జాన్ వెస్లీ ఈ సందర్భంగా తెలిపారు.

ప్రజల కష్టార్జితంతో నిర్మించిన సంస్థ ఎల్‌ఐసి

- పరిరక్షణ కోసం ఏజెంట్లు సైనికుల్లా పని చేయాలి
- సిఐటియు జాతీయ కోశాధికారి సాయిబాబు



మహాసభనుద్దేశించి మాట్లాడుతున్న సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ ప్రజల కష్టార్జితంతో నిర్మించబడిన సంస్థ ఎల్‌ఐసి అని, దాని రక్షణ కోసం ఏజెంట్లు సైనికుల్లా పనిచేయాలని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు చెప్పారు. ఎల్‌ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి ఎఒఐ) సౌత్ సెంట్రల్ జోనల్ 6వ మహాసభ శనివారం ఖమ్మం నగరంలోని జివిఆర్ ఫంక్షన్‌హాల్‌లో ప్రారంభమైంది. ఈ మహాసభలో సాయిబాబు ప్రారంభ ఉపన్యాసం చేశారు. 1956 ముందు దేశంలో ఉన్న రెండు వందలకు పైగా ప్రయివేట్ కంపెనీలు ప్రజల సొమ్మును దోచుకున్నాయన్నారు. ఆ దోపిడీని నివారించి ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలను రద్దుచేసి 1956లో ఎల్‌ఐసిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అప్పటి నుంచి ప్రజల మెప్పు పొంది రూ.57 లక్షల కోట్ల ఆస్తులతో, 30 కోట్ల మంది పాలసీదారులతో ప్రపంచంలో మూడో అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీగా అవతరించిందని వివరించారు. 99.5 శాతం క్లెయిమ్‌ల చెల్లింపు రికార్డుతో నమ్మకమైన ఇన్సూరెన్స్ కంపెనీగా ప్రజలకు సేవలు అందిస్తోందని తెలిపారు.

భారతదేశంలో నూతన ఆర్థిక విధానాలు ప్రారంభమైన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలను ప్రోత్సహించి ఎల్‌ఐసిని ప్రజలకు దూరం చేసే కుట్ర చేపట్టాయని అన్నారు. మోడీ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎల్‌ఐసినే కాకుండా బ్యాంకులు, రైల్వేలు, బొగ్గు, రక్షణ, విద్యుత్తు మొదలైన అనేక రంగాల్లో కూడా ప్రయివేటు కంపెనీలను ప్రోత్సహించే చర్యలు వేగవంతం చేసిందన్నారు. ఈ చర్యలను అడ్డుకుని ఎల్‌ఐసిని కాపాడేందుకు ఏజెంట్లు సైనికుల్లా పోరాడాలని, మిగతా ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులను కూడా కలుపుకొని ఐక్య పోరాటాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

ఎల్‌ఐసి అఖిలభారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురజిత్ కుమార్ బోస్, పిజి.దిలీప్ మాట్లాడుతూ.. ఎల్‌ఐసిని ఐపీఓలో లిస్టింగ్ చేసిన తర్వాత సంస్థ అభివృద్ధిలో మూల స్తంభంగా ఉన్న ఏజెంట్లకు నష్టం కలిగించే అనేక ప్రతిపాదనలు ముందుకు వచ్చాయన్నారు. గత సంవత్సరం ఏడు శాతం కమీషన్ తగ్గించడం ఇందులో భాగమే అన్నారు. అది సరిపోదన్నట్టు రాబోయే కాలంలో కమీషన్ తగ్గించడంతోపాటు ఇతర సౌకర్యాలకు కోత పెట్టాలని, కేంద్ర ప్రభుత్వం, ఐఆర్డీఏఐ రెండూ కలిసి ఎల్‌ఐసీ యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నాయని విమర్శించారు. ఈ చర్యలను తమ యూనియన్ వ్యతిరేకిస్తుందని, వీటికి వ్యతిరేకంగా ఎల్‌ఐసీ రక్షణ, ఏజెంట్ల హక్కుల సాధన కోసం భవిష్యత్‌లో ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘాలు, ఇతర ఏజెంట్ సంఘాలను కలుపుకుని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని, ఈ పోరాటాలలో ఏజెంట్లు అందరూ భాగస్వామ్యం కావాలని సూచించారు. ప్రముఖ వైద్యులు, మహాసభ ఆహ్వాన సంఘం చైర్మన్ డాక్టర్ సి.భారవి, యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి పిఎల్ నరసింహారావు, ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జోనల్ అధ్యక్షులు జి.తిరుపతయ్య, ఎల్‌ఐసి ఖమ్మం సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బాలాజీ నాయక్ మాట్లాడారు. తొలుత మహాసభ ప్రారంభ సూచకంగా యూనియన్ జెండాను ఎల్‌ఐసి ఎఒఐ జోనల్ అధ్యక్షులు ఎల్.మంజునాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాళ్లూరు శ్రీనివాసరావు, తన్నీరు కుమార్, ఖమ్మం బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు పి.ప్రసాద్, టి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్‌కు సబ్బండ కులాల మద్దతు

- బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నవీన్ యాదవ్‌కు రాజకీయ పార్టీలకతీతంగా సబ్బండ కులాలు మద్దతిస్తున్నట్టు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో కాంగ్రెస్ నేతలు ఇరావతి అనిల్ కుమార్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, డాక్టర్ వినయ్ కుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు బిసి సంఘాల నేతలతో భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో ఉన్న ఏకైక బీసీ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు తెలంగాణలోని 136 కుల సంఘాలు, 30 బీసీ సంఘాలు, 12 ఉద్యోగ సంఘాలతో పాటు సబ్బండ కులాలు మద్దతిస్తున్నట్టు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలంతా జూబ్లీహిల్స్ ఎన్నికలో రాజకీయ విజ్ఞతతో వ్యవహరించి బిసి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు శ్యాం కురుమ, గంగపుత్ర సంఘం అధ్యక్షులు ధీటీ మల్లయ్య, బిసి జాగృతి అధ్యక్షులు కెపి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు

మెడికవర్‌లో అరుదైన లింఫాంజియోమాకు చికిత్స

ప్రజాశక్తి - హైదరాబాద్

అరుదైన రైట్ నెక్ లింఫాంజియోమాకు విజయవంతమైన చికిత్స అందించి బాధితుడికి నూతన జీవితాన్ని అందించినట్లు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు తెలిపారు. 25 సంవత్సరాలుగా వేధిస్తున్న, మూడు సార్లు శస్త్రచికిత్సలు చేయించుకున్న కూడా పునరావృతం అవుతున్న కేసును విజయవంతంగా చికిత్స చేసి బాధితుడి జీవితానికి కొత్త ఊపిరి ఇచ్చినట్లు పేర్కొంది. "మూడు సార్లు శస్త్రచికిత్సలు చేయించుకున్నప్పటికీ వాపు మళ్లీ రావడంతో సమస్య మరింత తీవ్రమైంది. గడ్డ పెరిగి మెడ కదలికలు కష్టమవడం, శ్వాసలో ఇబ్బందులు వంటి సమస్యలు వచ్చాయని తెలిపింది. సీనియర్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయణ, కన్సల్టెంట్ జనరల్ సర్జన్ డాక్టర్ వెంకట్ పవన్, అనస్తేషియాలజీ విభాగం డాక్టర్ వేణుగోపాల్ గారి నేతృత్వంలో బహుళ నిపుణుల బృందం ఐదు గంటలు పాటు శ్రమించి అత్యంత క్లిష్టమైన రికన్‌స్ట్రక్టివ్ ఎక్సిషన్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారని ఆ హాస్పిటల్ వర్గాలు వెల్లడించాయి. ఆధునిక ఇమేజింగ్, ఖచ్చితమైన ప్రణాళికతో మేము ఎటువంటి సంక్లిష్టతలు లేకుండా అద్భుతమైన ఫలితాన్ని సాధించామని డాక్టర్ రాహుల్ లక్ష్మీ నారాయణ తెలిపారు.

రూ.60,799 కోట్లతో రోడ్ల నిర్మాణం

- మరో రూ.28 వేల కోట్లకు ప్రతిపాదన
- ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర చరిత్రలోనే మౌలిక సదుపాయాల కల్పనకు ఒకేసారి రూ. 60,799 వేల కోట్లతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్టు రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు. వీటితోపాటు మరో రూ. 28 వేల కోట్లతో చేపట్టనున్న మన్ననూరు నుంచి శ్రీ శ్రీశైలం, ఫ్యూచర్ సిటీ నుంచి బందరుపోర్ట్ వరకు చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు ప్రతిపాదనలో ఉన్నాయని తెలిపారు. శనివారం ఈ మేరకు మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మౌలిక సదుపాయాల కల్పనతో బహుళ జాతి సంస్థలకు తెలంగాణ కేంద్రంగా మారనుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులు రహదారుల నిర్మాణంతో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోకి పెద్ద సంఖ్యలో పరిశ్రమలు రానున్నాయని పేర్కొన్నారు. తద్వారా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయని అన్నారు. అబ్దుల్లాపూర్ ఇండస్ట్రియల్ పార్కు నుంచి విజయవాడ వరకు ఉన్న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 8 లైన్లుగా విస్తరించనున్నామని పేర్కొన్నారు. ఇందులో ఆరు లైన్లు ప్రధాన రహదారి కాగా, మరో రెండు సర్వీసు రోడ్ల కింద నిర్మాణం జరుగుతుందని తెలిపారు. రహదారి వెంట ఉన్న గ్రామీణ ప్రాంత ప్రజల సౌకర్యార్థం, రోడ్డు ప్రమాదాలు నివారించడమే లక్ష్యంగా సర్వీస్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 10,400 ఖర్చు చేయనున్నట్టు వివరించారు. తెలంగాణ రాష్ట్ర గతిని మార్చే రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణానికి రూ. 36,000 వేల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. ఆరు లైన్లుగా నిర్మించబోతున్న రీజినల్ రింగ్ రోడ్డు అన్నీ జిల్లాలను కలుపుతుందని వివరించారు. ఈ రహదారి నిర్మాణానికి 50 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. రహదారులు లేని గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్ల నిర్మాణంతోపాటు సింగిల్ రోడ్డు ఉన్నచోట డబుల్ రోడ్ల నిర్మాణం చేయనున్నట్టు తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రూ. 11,399 కోట్లతో కొద్ది రోజుల్లో టెండర్లు పిలవనున్నామని చెప్పారు. రూ. 8,000 వేల కోట్లతో మన్ననూరు నుంచి శ్రీశైలం 52 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ప్రతిపాదనలు తుది దశకు చేరాయని చెప్పారు. దేశానికే తలమానికంగా మారనున్న ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేని రూ. 20 వేల కోట్లతో నిర్మించనున్నామని ప్రకటించారు.

ఫీజు బకాయిలపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- బడా కాంట్రాక్టర్లకు బిల్లుల విడుదలపై శ్వేతపత్రం ప్రకటించాలి
- చేసిన అభివృద్ధిని చెప్పి జూబ్లీహిల్స్‌లో ఓట్లడగాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



పరిపాలన చాతగాకుంటే గద్దె దిగిపోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిఎం మానసిక స్థితిపై అనుమానాలున్నాయని చెప్పారు. జూబ్లీహిల్స్‌లో ఓడిపోతామనే భయంతోనే అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. పదేండ్లలో కెసిఆర్ చేసిన అభివృద్ధిని చూసి జూబ్లీహిల్స్ ప్రజలు బిఆర్‌ఎస్‌కు ఓటేసి మాగంటి సునీతను గెలిపించాలని పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. రెండేండ్లలో రేవంత్‌రెడ్డి పాలనలో చేసిందేమీ లేక గత కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలంటున్నారని అన్నారు. 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ పాలన చూసి ఓటేయమని అడిగే నైతిక హక్కు రేవంత్‌రెడ్డికి లేదన్నారు. ఆయన అప్పుడు కాంగ్రెస్‌లో లేరని గుర్తు చేశారు. జలయజ్ఞాన్ని ధనయజ్ఞం అన్నారని చెప్పారు. క్విడ్ ప్రోకో చేసి రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ వైఎస్‌పై ఆరోపణలు చేశారని అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గంటల కరెంటు కూడా సక్రమంగా వచ్చేది కాదంటూ రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తు చేశారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు తప్పు అని ఒప్పుకోవాలనీ, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాతే జూబ్లీహిల్స్ ప్రజలను ఓట్లడగాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,600 కోట్లే ఉన్నాయనడం సరైంది కాదన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా?అని సవాల్ విసిరారు. రూ.ఎనిమిది వేల కోట్లకుపైగా ఫీజు బకాయిలున్నాయని డిమాండ్ చేశారు. బీహార్ ఎన్నికలకు ముందు బడా కాంట్రాక్టర్లకు ఇచ్చిన బిల్లులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. పిల్లల చదువులు ముఖ్యమా?, కమీషన్లు ముఖ్యమా?అని అడిగారు. మందిని తొక్కడం, మాట తప్పడం రేవంత్‌రెడ్డి నైజమని అన్నారు. వికృత చేష్టలు, విచిత్ర విన్యాసాలు తప్ప ప్రజలకు పనికొచ్చే ఒక్క పని కూడా చేయలేదన్నారు. దొంగే దొంగ అన్నట్టుందిగా రేవంత్ రెడ్డి తీరు ఉందని చెప్పారు. కిషన్‌రెడ్డి, రేవంత్ రెడ్డిదే ఫెవికాల్ బంధమని అన్నారు. ఆయనపై ఓటుకు నోటు కేసులో ఈడీ కేసు ఉందనీ, ఎందుకు విచారణ జరగడం లేదని ప్రశ్నించారు. పొంగులేటి ఇంటిపై ఇడి దాడి చేస్తే ఎందుకు విచారణ జరగడం లేదన్నారు. బీహార్ ఎన్నికలకు డబ్బులు పంపుతున్నారంటూ ఢిల్లీలో భట్టి విక్రమార్క ఇంట్లో ఐటీ దాడులు జరిగాయని అన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కానిస్టేబుల్ ఆత్మహత్య

హైదరాబాద్ బ్యూరో : ఆర్థిక సమస్యలతో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మల్లికార్జున నగర్‌కు చెందిన డి.శ్రీకాంత్ (2009 బ్యాచ్) హైదరాబాద్ ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించేవారు. కొంతకాలంగా అతను ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ మూడు నాలుగు రోజులుగా విధులకు సైతం వెళ్లడం లేదు. ఈ క్రమంలో అతను శనివారం తన ఇంట్లో చీరతో ఊరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన తండ్రి మాణిక్‌రావు గది తలుపులు తీసి అతన్ని కిందకు దింపి చూడగా అప్పటికే చనిపోయారు. మృతుడు కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హైకోర్టు అడ్మినిస్టేటర్ జనరల్ అఫీషియల్ ట్రస్టీగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైకోర్టు అడ్మినిస్ట్రేటర్ జనరల్, అఫీషియల్ ట్రస్టీగా సోమా శ్రీనివాసరావు శనివారం హైదరాబాద్‌లో బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఈ పదవిలో మూడేండ్లపాటు కొనసాగుతారు. హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు ఆయనను అభినందించారు. సమర్థుడైన న్యాయవాదిగా గుర్తింపు పొందిన శ్రీనివాసరావుకు ప్రభుత్వం ఈ పదవిని ఇవ్వడం పట్ల అన్ని జిల్లాల న్యాయస్థానాల అధికారులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

క్లైమాక్స్‌లోకి జూబ్లీహిల్స్ ప్రచారం

- జోరులో కాంగ్రెస్
- కానరాని కెసిఆర్
- అభ్యర్థిని పట్టించుకోని బిజెపి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్ తేదీ సమీపించింది. ఆదివారం ప్రచారం ముగియనుంది. ఆయా రాజకీయపార్టీల ప్రచారం క్లైమాక్స్‌కు చేరింది. సోమవారం మైకులు మూగబోనున్నాయి. ఇంటింటి ప్రచారంలో అనేక మతులబులు జరిగే అవకాశాలు లేకపోలేదని సమాచారం. మూడు పార్టీల అభ్యర్థులు డబ్బును నీళ్లలా ఖర్చుపెడుతున్న నేపథ్యంలో గెలుపుపై అంచనాలు, ఊహాగానాలు పెరిగిపోతున్నాయి. వందల కోట్లు పెడుతున్నాయనే ప్రచారం సైతం ఉంది. ఆయా మీడియా సంస్థలు, ఇతర ఏజెన్సీలు సర్వేలు సైతం నిర్వహిస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్ తరపున ముఖ్యమంత్రితో సహా మంత్రులు, ఇతర సీనియర్ నేతలు ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు. తమ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఏకరువు పెడుతున్నారు. రాజీవ్‌గాంధీ విజన్‌ను ఓటర్ల దృష్టికి తెస్తున్నారు. అదే బిఆర్‌ఎస్ అభ్యర్థి మాగంటి సునీత తరపున ప్రచారానికి ఆ పార్టీ అధినేత కెసిఆర్ రాకపోవడం గమనార్హం. హరీష్‌రావు తండ్రి చనిపోవడంతో కెటిఆరే అంతా తానై వ్యవహరిపస్తున్నాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అరోపణలు, విమర్శలు చేస్తున్నారు. ఇకపోతే బిజెపి అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తరపున స్థానిక కేంద్ర మంత్రులు, ఒకరిద్దరు ఇతరులు ప్రచారానికి వచ్చారు. కానీ కీలకమైన కేంద్ర ఆర్థిక మంత్ర నిర్మాలా సీతారామన్ వస్తానని చెప్పి రాలేదు. రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, ఎంపి తేజస్వీ సూర్య, అన్నామల్లే, పురందేశ్వరి తదితరులు సైతం ప్రచారంలో పాల్గొనలేదు. ఈ విషయంలో ఆ పార్టీలో అసంతృప్తి నెలకొందనే ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి సర్కారు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చెబుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి గోపినాథ్ మరణాన్ని సెంటిమెంట్ కింద వాడుకుంటూనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఏజెండా చేస్తున్నారు. ఇక బిజెపి విషయానికొస్తే దివంగత మాగంటి గోపినాథ్ మరణాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ వివాదాస్పదం చేసే ప్రయత్నం చేశారు. సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇదిలావుండగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్ ఉప ఉన్నిక నేపథ్యంలో కీలక ప్రకటన చేశారు. ఈనెల 11 సాయంత్రం నుంచి 15వ తేదీసాయంత్రం వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయని ప్రకటించారు. నిర్దేశించిన సమయాల్లో మద్యం దుకాణాలతోపాటు హోటళ్ళు ,, రెస్టారెంటులు, క్లబ్బులు మూసివేయాలని ఆదేశించారు. నియోజకవర్గంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది గుమిగూడరాదని స్పష్ట చేశారు. కాగా జూబ్లీహిల్స్‌లో దాదాపు 4.01 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిని ప్రభావితం చేసేందుకు మూడు పార్టీల అభ్యర్థులు నానాతిప్పలు పడుతున్నారు. 11న పోలింగ్ భూత్‌లకు ఓటర్లు వచ్చేలా అభ్యర్థులు వ్యక్తిగత శ్రద్ధతీసుకుంటున్నారు. భూత్‌లవారీగా ఇప్పటికే కమిటీలు వేసి రప్పించేందుకు శ్రమిస్తున్నారు. ఈ ముక్కోణపు పోటీపట్ల దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. సోషల్‌మీడియాను సైతం అభ్యర్థులు ప్రచారానికి ఉపయోగించుకుంటున్నారు. అనేక ఊహాగానాల నేపథ్యంలో అటు పార్టీలు, ఇటు అభ్యర్థులు పోటాపోటీగా ఉప ఎన్నిక బరిని సవాల్‌గా తీసుకున్నారు.

జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

- బిఆర్ఎస్ గెలిస్తే బిజెపికే ఉపయోగం : కూనంనేని

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్యపద్మ, ఇటి నర్సింహాతో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ గెలిస్తే బిజెపికే ఉపయోగమని చెప్పారు. బిఆర్ఎస్‌వి నిలకడ లేని విధానాలని విమర్శించారు. ఆ రెండు పార్టీల మధ్య ఆంతరంగిక దోస్తానం కొనసాగుతోందని తెలిపారు. లౌకిక, సామాజిక, సామ్రాజ్య వాద విషయాల్లో బిజెపికి అది అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. కేసుల సమస్యతో కేంద్రంతో ఘర్షణ పడేందుకు సిద్ధంగా లేదని చెప్పారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా బిజెపికి మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. దేశంపై ట్రంప్ విధించిన సుంకాల పట్ల మోడీ మౌనంగా ఉండటం తగదన్నారు. ఆయన అమెరికాకు లొంగిపోయాడని విమర్శించారు. అలీన విధానాన్ని మంటగలుపుతున్నారని దుయ్యబట్టారు. కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. నేపాల్‌లో కమ్యూనిస్టులు ఐక్యమయ్యారని, మన దేశంలో కూడా ఆ విధంగా విలీనమైతే మంచిదని చెప్పారు.

పత్తి రైతుల రాస్తారోకో

- కపాస్ కిసాన్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ • ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఆందోళనలు



జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పత్తి కొనుగోళ్లలో సిసిఐ నిబంధనలను నిరసిస్తూ శనివారం ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో రైతులు ఆందోళనలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై రైతులు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఆడే వసంత్‌రావు మాట్లాడుతూ.. సిసిఐ రైతుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. పత్తి తేమ శాతాన్ని ప్రస్తుతమున్న 12 శాతం నుంచి 20 శాతం వరకు పెంచాలని, సోయా పంట తేమ శాతాన్ని 8 నుంచి 18 శాతం వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పత్తి పంటను ఎకరానికి 12 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్న కపాస్ కిసాన్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. సిసిఐ తేమ శాతం పేరుతో రైతుల పత్తిని తిరస్కరిస్తోందన్నారు. కపాస్ కిసాన్ యాప్ వల్ల రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ఆ యాప్‌ను రద్దు చేసి, తేమ శాతాన్ని 20 శాతానికి పెంచి రైతుల వద్ద ఉన్న మొత్తం పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో రైతు సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పత్తి కొనుగోళ్లు చేయాలని రైతుల ధర్నా

పత్తి పంటను పాత పద్ధతిలో సిసిఐ కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేస్తూ.. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిపిఎం, బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ.. కొత్తగా సిసిఐ తీసుకొచ్చిన నిబంధనలతో రైతులు పడరాని పాట్లు పడుతున్నారని అన్నారు. పాత విధానంలోనే పత్తి కొనుగోళు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సంగారెడ్డి డిఎస్‌పి సత్తయ్యగౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు, పారామిల్ట్రి పోలీసులు ఘటనా స్థలానికి భారీగా చేరుకున్నారు. కంకోల్ టోల్ ప్లాజా 65 జాతీయ రహదారిపై ధర్నా చేయడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, సిపిఎం నాయకులు రమేష్ గౌడ్, సిపిఎం నాయకులు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్, మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సతీష్ కుమార్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మెన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపిపి రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రసూల్ పటేల్, బుర్కల పాండు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విలేకర్ల సమావేశంలో మల్లు లక్ష్మి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి
- ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వెంటనే విడుదల చేయాలి : మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి ఐకెపి కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని కాంట వేసి లిఫ్ట్ చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్థానిక మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతాంగం ఆరు గాలం కష్టపడి పంట పండించి ఐకెపి కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకొచ్చి నెలలు గడుస్తున్నా కాంటాలు వేయలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఐకెపి కేంద్రాలకు వచ్చింది వచ్చినట్టు ధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు. ఇటీవల కురిసిన తుఫాన్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఇతర వాణిజ్య పంటలతో పాటు కూరగాయలు దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి పంటకు ఎకరాకు రూ.50 వేలు, ఇతర వాణిజ్య పంటలకు రూ.70 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలోని 1800 ప్రయివేట్ కాలేజీలో చదివే 14 లక్షల మంది విద్యార్థులకు మొత్తం రూ.9,966 కోట్ల ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్ ఉందని తెలిపారు. ఇప్పటివరకు ప్రభుత్వం రూ.300 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు మిగతా రూ.900 కోట్లు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, కోట గోపి ఉన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు రూ.50 లక్షల బీమా వర్తింప జేయండి

- ఏడు ప్రధాన బ్యాంకులకు సింగరేణి సిఎండి బలరామ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు రూ.50 లక్షల ప్రమాద భీమా వర్తింపజేయాలని ఏడు ప్రధాన బ్యాంకులకు సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ విజ్ఞప్తి చేశారు. శనివారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కెనరా బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి ఉన్నతాధికారులతో సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల శ్రేయస్సే లక్ష్యంగా పని చేస్తున్న సింగరేణి ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందని గుర్తు చేశారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు సంస్థ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా బ్యాంకులు సానుకూలంగా స్పందించాలని కోరారు. "ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా సింగరేణి ఉద్యోగులకు గరిష్టంగా రూ.1.25 కోట్ల వరకు, పొరుగు సేవల సిబ్బందికి రూ.40 లక్షల వరకు బీమా అందిస్తున్నాం. ఇప్పటి వరకు వివిధ ప్రమాదాల్లో మరణించిన 34 మందికి రూ.30 కోట్ల బీమా సొమ్మును బ్యాంకుల ద్వారా అందించాం. ఇది వారి కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పించింది" అని వారికి వివరించారు. అలాగే ఒప్పంద కార్మికులకు కనీసం రూ.50 లక్షల ప్రమాద బీమా అందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సింగరేణి ఉద్యోగులు సహజ మరణం పొందితే కనీసం రూ.20 లక్షల టర్మ్ ఇన్సురెన్స్ ఇచ్చే విషయంలోనూ సహకరించాలని బ్యాంకులను సిఎండి బలరాం కోరారు. సంస్థ అభ్యర్థనపై బ్యాంకర్లు సానుకూలంగా స్పందించారు. సింగరేణితో దీర్ఘకాల వాణిజ్య బంధాన్ని కొనసాగించేందుకు మెరుగైన ప్యాకేజీని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ పర్సనల్ గౌతమ్ పొట్రు, జిఎం (కో ఆర్డినేషన్) టి శ్రీనివాస్, ఎజీఎం (ఫైనాన్స్) చక్రవర్తి, బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సింగరేణికి ఘనా దేశం ఆహ్వానం : సిఎండి బలరామ్

తమ దేశంలో పెట్టుబడులు పెట్టాలని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సిసిఎల్)ను ఘనా దేశం ఆహ్వానించింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శనివారం ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సంస్థ సిఎండి ఎన్ బలరామ్‌తో సమావేశమై పలు వ్యాపార అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ దేశంలో ఖనిజ రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలున్నాయని, ఈ విషయంలో విశేష అనుభవం గల సింగరేణి సంస్థకు తాము స్వాగతం పలుకుతున్నామని చెప్పారు. వజ్రాలు, బంగారం, బాక్సైట్, మాంగనీస్, లిథియం వంటి పలు ఖనిజాలను మైనింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తున్నామని చెప్పారు. అయితే ఈ రంగంలో మరింత ఉత్పత్తి పెంచడానికి అవసరమైన పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. తమ దేశంలో బొగ్గు మైనింగ్ కూడా ఉందని, అందులోనూ సింగరేణి సహకారాన్ని కోరుతున్నట్టు చెప్పారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా విదేశాల్లో కీలక ఖనిజ రంగాల్లో కూడా ప్రవేశించాలని ఇప్పటికే నిర్ణయించిందని సిఎండి బలరాం తెలిపారు. ఘనా దేశంలోనూ మైనింగ్ జరపటానికి గల అవకాశాలను పరిశీలిస్తామన్నారు. కీలక ఖనిజాల తవ్వకాలకు అవకాశం ఉంటే అధిక ప్రాధాన్యత ఇస్తామని వారికి హామీ ఇచ్చారు. మరో నెల రోజుల్లో ఘనా దేశానికి చెందిన సాంకేతిక నిపుణులు కేంద్ర ప్రభుత్వంతో సమావేశం కానున్నారని ఆ దేశ ప్రతినిధి బృందం పేర్కొంది. ఆ సమయంలో మరో దఫా సమావేశం కావడంతో పాటు తమ దేశానికి సింగరేణి ప్రతినిధి బృందాన్ని పంపించాల్సిందిగా వారు సిఎండిని కోరారు. అధికారుల బృందాన్ని ఘనా దేశానికి పంపిస్తామని సిఎండి బలరాం ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. సంస్థ విస్తరణలో ఇది శుభపరిణామని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో డైరెక్టర్ (పి అండ్ పి) కె వెంకటేశ్వర్లు, డైరెక్టర్ (పర్సనల్) గౌతమ్ పొట్రు, జిఎం (కో ఆర్డినేషన్) టి శ్రీనివాస్, ఘనా దేశ ప్రతినిధి బృందంలో బిజినెస్ కన్సల్టెంట్ అబ్దుల్ సలాం మోర్గాన్ అగ్బోటు, ఘనా దేశం తరపున మాలి దేశ రాయబారి అహ్మద్ ఉమర్ సాండా ఇతర అధికారులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికలు పారదర్శకంగా జరపాలి

- బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు పారదర్శకంగా జరపాలని బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఎన్నికల కమిషన్ (ఇసి)ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కుక్కర్లు పంచడం, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా డబ్బులు పంచుతామంటూ ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నదని ఆరోపించారు. ఎన్నికల కమిషన్, అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. బైండోవర్ చేసిన 140 మందిని ఎన్నికల రోజు బయటకు రానివ్వొద్దని ఈసీని కోరారు. కొందరు పోలీసుల దౌర్జన్యం, అరాచకాలు ఎక్కువయ్యాయని చెప్పారు. ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను బెదిరిస్తున్నారని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోలీసులు రేవంత్‌రెడ్డి ప్రయివేటు సైన్యంలా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీలో బిజెపి ఎంపిలే రేవంత్ దోస్తులని అన్నారు. బిజెపి ఎంపికి రేవంత్‌రెడ్డి కాంట్రాక్టు యిచ్చారని గుర్తు చేశారు. బిజెపి సిఎంల కన్నా ముందు రేవంత్‌రెడ్డికి ప్రధాని మోడీ అపాయింట్‌మెంట్ ఎలా దొరుకుతున్నదని ప్రశ్నించారు. కాంగ్రెస్, బిజెపిల బంధం అంత దృఢంగా ఉందన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి పెద్దమ్మ, చిన్నమ్మ కొడుకుల్లా ఉంటారని అన్నారు.

చంద్ర ప్రకాశ్ మృతి పట్ల మహేశ్ కుమార్ గౌడ్ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గాంధీ భవన్ ట్రస్ట్ చైర్మెన్ చంద్ర ప్రకాశ్ రావు మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. గాంధీజీ ఆశయాల పట్ల అత్యంత నిబద్ధతతో పని చేసిన చంద్ర ప్రకాష్ రావ్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


సంఘ్ పరివార్ దేశానికి ప్రమాదకరం

- దేశ మూల సూత్రాలకు వ్యతిరేకంగా సంఘ్ తీరు
- తెలంగాణ పౌరహక్కుల సంఘం రాష్ట్ర మూడో మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ మూల సూత్రాలకు వ్యతిరేకంగా సంఘ్ పరివార్ పనిచేస్తోందని, అది దేశానికి ప్రమాదకరమని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర మూడో మహాసభ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ.. హక్కుల కోసం పోరాడే వారిని రాజ్యం హింసకు గురిచేస్తోందని తెలిపారు. ప్రశ్నించే వారి గొంతులు నొక్కి జైల్లో బంధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా మాట్లాడుకునే హక్కు కూడా లేకుండా పోయిందన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చాక దళితులు, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డి నరసింహారెడ్డి మాట్లాడుతూ.. దేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నదని, ఆర్థిక అసమానతలు పెరిగిపోయాయని తెలిపారు. మెజారిటీ ప్రజలు ఆకలితో అలమటిస్తున్నారని, దీన్ని కప్పిపుచ్చుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నదని వాపోయారు. ప్రజాస్వామ్య రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రభుత్వాలు జవాబుదారీగా ఉండి అమలు చేయాల్సింది పోయి వాటిని విస్మరించి ప్రజలపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని అన్నారు.

జస్టిస్ కొల్సే పాటిల్ మాట్లాడుతూ.. సంఘ్ పరివార్ మానవత్వాన్ని తుంగలో తొక్కుతోందన్నారు. ఓ వైపు మావోయిస్టులను చంపుతూ.. మరోవైపు మైనార్టీలకు, కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో పాత్ర లేనివారు వందేమాతరం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పర్యావరణాన్ని విధ్వంసం చేస్తూ.. మావోయిస్టులను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో నేరాలకు పాల్పడిన మోడీ, అమిత్‌షాను ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధమైన హోదాలలో కొనసాగే నైతిక హక్కు వారు కోల్పోయారన్నారు. మావోయిస్టులను తీవ్రవాదులతో సమానంగా చూడటం సరికాదన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. సంఘ్ పరివార్‌కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి మాట్లాడుతూ.. ఆదివాసులు అనాదిగా స్వరాజ్యం కోసం, స్వాతంత్ర్యం కోసం పోరాడారన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను చంపడం అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. ఎన్‌కౌంటర్లు అన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సరోజిగిరి, ప్రొఫెసర్ కె నరసింహారెడ్డి, సామాజిక కార్యకర్త బేలా బాటియా, పౌరహక్కుల సంఘం నాయకులు కె రవి, ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు, నర్ర పురుషోత్తం, ప్రొఫెసర్ సరోజ్ గిరి, అడ్వకేట్ రఘునాథ్, ఎ లింగన్న తదితరులు ప్రసంగించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

జూబ్లీహిల్స్ అభివృద్ధికి నవీన్‌యాదవ్‌ను గెలిపించండి

- టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం సిఎం రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని ఇప్పటికే అనేక రకాలుగా అభివృద్ధి చేశామని, ఇంకా అభివృద్ధి చెందాలంటే యువకుడు, విద్యావంతుడు, నిత్యం ప్రజల మధ్య ఉండే నాయకుడు నవీన్ యాదవ్‌ను గెలిపించాలని ఓటర్లకు కోరారు. నవీన్‌యాదవ్ విజయం సాధించిన వెంటనే ప్రజలు సమస్యలు తెలియజేస్తే ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరించే బాధ్యతను అతను తీసుకుంటారని చెప్పారు. తాను కూడా ఆ దిశగా కృషి చేస్తానన్నారు. బాగా ఆలోచించి మీ భవిష్యత్, పిల్లల భవిష్యత్ బాగుపడాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. తామంతా జవాబుదారీగా ఉండి మీ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. బిఆర్ఎస్, బిజెపి గెలిస్తే ఎలాంటి ఉపయోగమూ ఉండదని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని సూచించారు. వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందించేందుకు సీఎం ఆలోచిస్తున్నారని, ఇందుకు సంబంధించిన బడ్జెట్ సమకూర్చుకోవడంలో నిమగ్నమయ్యారని తెలిపారు. సోషల్ మీడియా వారు కెటిఆర్ అనుమతితో తెలంగాణ భవన్‌లోనే నివసిస్తున్నారని తనకు అనుమానంగా ఉందన్నారు. అలాగే హైడ్రాను బూచిగా చూపిట్టే ప్రయత్నం చేస్తున్నారని, జూబ్లీహిల్స్‌లో ఏ ఒక్క ఇల్లు కూల్చలేదని తెలిపారు. నవంబర్ 11న జరిగే పోలింగ్‌లో కాంగ్రెస్ "చేతి" గుర్తుకు ఓటు వేసి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని, జూబ్లీహిల్స్ ఓటర్లు వివేకవంతులని, మీపై తనకు నమ్మకం ఉందని అన్నారు.

ఒలెక్ట్రాకు రూ.49.5 కోట్ల లాభాలు

- క్యూ2 ఆదాయంలో 25 శాతం వృద్ధి



హైదరాబాద్ : ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ (ఒజిఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 4.2 శాతం వృద్ధితో రూ.49.5 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.47.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2025-26 క్యూ2 ఫలితాలకు ఆ కంపెనీ బోర్డు శనివారం ఆమోదం తెలిపింది. ఈ త్రైమాసికంలో ఒలెక్ట్రా రెవెన్యూ 25.4 శాతం పెరిగి రూ.657 కోట్లకు చేరింది. 2024-25 ఇదే త్రైమాసికంలో రూ.524 కోట్ల రెవెన్యూ ఆర్జించింది. అయితే మార్జిన్లు మాత్రం 15.5 శాతం నుంచి 13.6 శాతానికి తగ్గాయి. గడిచిన క్యూ2లో 375 వాహనాలను డెలివరీ చేసి నూతన మైలు రాయిని సాధించినట్లు ఒలెక్ట్రా తెలిపింది. ఇప్పటి వరకు 3254 వాహనాలు డెలివరీ చేయటంతో పాటు 9818 వాహనాల ఆర్డర్ బుక్ తో భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేసుకుంది. "ఒక త్రైమాసికంలో అత్యధికంగా 375 ఎలక్ట్రిక్ వాహనాలు, అందులో 25 ఎలక్ట్రిక్ టిప్పర్లు విజయవంతంగా డెలివరీ చేయడం మాకు గర్వకారణం. ఆపరేషనల్ సామర్థ్యంపై ఫోకస్ పెట్టడం ద్వారా ఆదాయంలో, లాభంలో గణనీయమైన వృద్ధి సాధించాము. భారతదేశంలో తొలిసారిగా బ్లేడ్ బ్యాటరీ ప్యాక్ సర్టిఫికేషన్ సాధించినందుకు సంతోషిస్తున్నాము." అని ఒలెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ మహేశ్ బాబు పేర్కొన్నారు.

భావప్రకటన స్వేచ్ఛ లేకపోతే ప్రజాస్వామ్యం నిలువదు

- జస్టిస్ బి సుదర్శన్ రెడ్డి
- రాఘవాచారి 6వ స్మారకోపన్యాసం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భావప్రకటన స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ఆధారమని, అది లేకుంటే ప్రజాస్వామ్యం నిలువదని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి.రాఘవాచారి 6వ స్మారకోపన్యాసం సి రాఘవాచారి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాఘవాచారి భయమెరుగని జర్నలిస్టని, విలువలను కాపాడిన మహనీయుడని కొనియాడారు. రూ.5000 వేతనంలో జీవిస్తూ, రిక్షాలో ప్రయాణం చేస్తూనే మూడు దశాబ్దాల పాటు విశాలాంధ్రను నిబద్ధతతో నడిపారని గుర్తుచేశారు. 1939లో పాలకుర్తిలో జన్మించిన ఆయన సంస్కృతం, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రావీణ్యం సాధించారని, రామాయణం, మహాభారతం, భాగవతం వంటి గ్రంథాలు లోతుగా అధ్యయనం చేశారని వివరించారు. రచనలో ఏం కావాలి, ఏం రాయకూడదన్న విషయంలో రాఘవాచారి పాఠాలు తనంతట తాను నేర్చుకోవాలని భావించారని చెప్పారు. పత్రికలు, యాజమాన్యాలు, సంపాదకులకు విడదీయలేని సంబంధముందని, అయినప్పటికీ పత్రికా స్వేచ్ఛను ప్రజలు, కోర్టులు ఎల్లప్పుడూ రక్షించాయని తెలిపారు. ఆర్టికల్ 19 (1)పై నెహ్రూ ప్రభుత్వం చేసిన సవరణలను, సర్క్యులేషన్ తగ్గించేందుకు ఆంక్షలు విధించాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను సుప్రీం కోర్టు తిరస్కరించిందని గుర్తుచేశారు. సోషల్ మీడియా ఇప్పుడు మీడియా ఉద్యోగుల చేతుల్లో లేదని, ప్రపంచంలోని కొద్దిమంది ధనవంతుల నియంత్రణలోకి వెళ్లిందని అన్నారు. దీనిపై నియంత్రణ సాధ్యాసాధ్యాలపై సుప్రీం కోర్టులో చర్చ జరుగుతుందని చెప్పారు. మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. మీడియాను రాజ్యాంగంలో పేర్కొనకపోవడం అంబేద్కర్ తీసుకున్న సుదూరదృష్టి నిర్ణయమని తెలిపారు. ప్రజల తరపున స్వేచ్ఛగా పనిచేయడమే మీడియా ఉద్దేశం కాబట్టి దాన్ని రాజ్యాంగపు బంధంలో పెట్టరాదనే భావన అంబేద్కర్‌కు ఉన్నదని చెప్పారు. రమేష్ థాపర్ కేసులో ఆర్టికల్ 19(1)(ఎ)లో పత్రికా స్వేచ్ఛ అంతర్భాగమని సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మొదట ట్రస్ట్ సభ్యులు డి సోమసుందర్ స్వాగతం పలికారు. చివరలో డాక్టర్ సి.అనుపమ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పత్రికా రంగ ప్రముఖులు కె రామచంద్రమూర్తి, ఆర్‌వి రామారావు (విశాలాంధ్ర ఎడిటర్), దేవులపల్లి అమర్ (మన తెలంగాణ ఎడిటర్), టిడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, ఐజేయూ నాయకులు ఎంఎ మాజిద్, వై నరేందర్ రెడ్డి, ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షులు సయ్యద్ అజీజ్ పాషా, ట్రస్ట్ సభ్యులు కె జ్యోత్స్న, వైవి కృష్ణ, ఎ చందర్, టి సురేష్, బి జమిందార్ పాల్గొన్నారు.

మా గ్రామాలను తరలించండి

- ఎన్‌టిపిసి బూడిదతో బతకలేక పోతున్నాం • చర్మ, శ్వాసకోశ ఇతర వ్యాధులు చుట్టు ముడుతున్నాయి
- కుందనపల్లి, శాలపల్లి గ్రామస్తుల ఆవేదన • ఎన్‌టిపిసి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి వేడుకోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రామగుండం ఎన్‌టిపిసి ఫ్యాక్టరీ నుంచి వచ్చే బూడిద వల్ల ఆ రెండు గ్రామాలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. బూడిద సృష్టిస్తున్న విధ్వంసంతో ఇక్కడ తాము జీవించలేమని, మరోచోట పునరావాసం కల్పించాలని మూడు దశాబ్దాలుగా కుందనపల్లి, శాలపల్లి గ్రామస్తులు ఉద్యమాలు చేస్తున్నారు. గతంలో వంద రోజులపాటు పెద్ద ఎత్తున దీక్షలు, ఆందోళనలు చేసినా.. ఎవరు కనికరించలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగాన్ని కలిసి వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. థర్మల్ విద్యుత్ కేంద్రం బూడిద కాలుష్యం నుంచి తమను కాపాడాలని వారు వేడుకుంటున్నారు.

ఎప్పుడైనా, ఎక్కడైనా కాలుష్యపు పొగ గాని, ఏదైనా ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము ధూళి గాని కొద్దిసేపు వస్తేనే ఊపిరాడక విలవిల్లాడిపోతాం. కానీ 40 ఏళ్లుగా ఆ ఊర్లకు పక్కనే ఉన్న పరిశ్రమ వదిలే కాలుష్యాన్ని పీలుస్తూ ఆయుష్షును కోల్పోతున్నారు. పెద్దపల్లి జిల్లా రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలో రాజీవ్ రహదారిని ఆనుకుని రాజాపూర్, కుందనపల్లి గ్రామాలు ఉండేవి. 40 ఏళ్ల కింద ఎన్‌టిపిసి పవర్ ప్రాజెక్ట్ కోసం వేలాది ఎకరాల సాగు భూములను సేకరించారు. అదే క్రమంలో ప్రభావిత గ్రామమైన రాజాపూర్ గ్రామాన్ని తరలించిన అధికారులు కుందనపల్లి దాని ఆమ్లెట్ గ్రామమైన శాలపల్లిని పట్టించుకోలేదు. ఎన్‌టిపిసి సేకరించిన 1,200 ఎకరాల్లో బూడిద చెరువును ఏర్పాటు చేయడం వారికి శాపంగా మారింది. కరకట్టల ఎత్తు పెంచడంతో బూడిద నిల్వ పెరిగింది. ఫలితంగా నాలుగు దశాబ్దాల కాలంలో చుట్టూ పది కిలోమీటర్ల దూరం వరకు పర్యావరణం కాలుష్యంగా మారింది. సిఎస్ఆర్ కింద కొన్ని పనులు చేపట్టినా అవి ఆగ్రామాన్ని కాలుష్యం నుంచి రక్షించలేక పోతున్నాయి. గాలులకు బూడిద పైకి లేచి నివాస గృహాలను నింపేస్తోంది. రెండు గ్రామాల ప్రజలు స్థానిక కాలుష్య నియంత్రణ మండలికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదులు చేసినా.. అవి పరిశీలనలు, నివేదిక సమర్పణల వరకే పరిమితమయ్యాయే తప్ప శాశ్వత చర్యలు చేపట్టలేదు.

నీరు, గాలి విషతుల్యం

బొగ్గు బూడిదను పారవేయడం వల్ల భారీ లోహాలు, ఇతర విషపదార్థాలతో నేల, నీరు, గాలి విషతుల్యంగా మారాయి. ఇది సమీప గ్రామాల ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రభావం చూపిస్తోంది. ఈ ప్రాంతాలలో నివసించే మనుషుల జీవిత కాలం కనీసం పదేండ్లు తగ్గుతోందని వైద్యులు చెబుతున్నారు. శ్వాసకోశ వ్యాధులు, చర్మ, ఎముకల జబ్బులు, గుండె సంబంధిత రోగాలలతో ఎక్కువగా బాధపడుతున్నారు. ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ మండలి పట్టించుకోక పోవడంతోనే జల, వాయు, శబ్ద కాలుష్యం నియంత్రణ చేయలేని స్థాయికి చేరిందని నిపుణులు అంటున్నారు. ఫలితంగా కుందనపల్లి, శాలపల్లి గ్రామాల ప్రాంతంలో మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

40 ఏళ్లలో రెండువేలకుపైగా మరణాలు

ఎన్‌టిపిసి బూడిద వెదజల్లే కాలుష్యం వల్ల కుందనపల్లి, శాలపల్లి గ్రామాల్లోని ప్రతి కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు అనారోగ్యానికి గురవుతున్నారు. చిన్న వయసులోనే రోగాల బారిన పడుతున్నారు. గ్రామ పంచాయతీ రికార్డుల ప్రకారం గడిచిన 40 ఏళ్లలో దాదాపు రెండు వేల మందికి పైగా మరణించారు. వేలాది మంది అనారోగ్యం పాలయ్యారు. యాజమాన్యం గ్రామాన్ని దత్తత తీసుకుని కొన్ని సౌకర్యాలను కల్పించింది. గ్రామంలో పైపులైన్లు వేయడం ద్వారా తాగునీటిని సరఫరా చేయడంతో పాటు, స్థానిక ప్రజలకు చికిత్స అందించడానికి వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. అయితే ఇవేమి ఆ రెండు గ్రామాల ప్రజల జీవన కాలం పెరగడానికి ఉపయోగపడటం లేదు. రాష్ట్రంలోని మిగతా గ్రామాలతో పోల్చితే సగటు జీవిత కాలం దాదాపు పదేళ్లకుపైగా తగ్గుతోందని డాక్టర్లు అంటున్నారు. వేసవి కాలంలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటోంది. గ్రామస్తులు ఆందోళన బాట పట్టినప్పుడు వారిని శాంతింప చేయడానికి వస్తున్న అధికారులు, నాయకులు తిరిగి మళ్లీ కనిపించడం లేదు. గ్రామాన్ని తరలించే వరకు స్థానికంగా వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామాన్ని తరలించండి.

కత్తరమల్ల మనోహర్, మల్యాలపల్లి, రామగుండం మండలం చుట్టూ ఫ్యాక్టరీలు.. మధ్యన మా గ్రామం.. ఎటూ వెళ్లలేని పరిస్థితి. ఎన్‌టిపిసి బూడిద పైప్‌లైన్ లీకేజి అయినప్పుడల్లా గ్రామం మొత్తం బూడిదతో నిండిపోతోంది. గ్రామానికి చెందిన రిజర్వాయర్, స్మశాన వాటికకు వెళ్లే దారిని కూడా ఇటీవల ఎన్‌టిపిసి యాజమాన్యం మూసేసింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగాలు, నొప్పులు, చావులు నిత్యకృత్యమయ్యాయి. మల్యాలపల్లి గ్రామాన్ని వెంటనే ఇతర ప్రాంతానికి తరలించాలి.

పునరావాసం కల్పించాలి
కోదాటి తిరుపతి, మాజీ కార్పొరేటర్, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్

ఎన్‌టిపిసి బూడిదతో గత 40 ఏళ్లుగా కుందనపల్లి, శాలపల్లి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎఅధికారులు, రాజకీయ నాయకుల నుంచి మొదలుకుని అందరికి విజ్ఞప్తి చేశాం. అయినా మా మొర ఎవరు పట్టించుకోవడం లేదు. గ్రామాలను దత్తత తీసుకుని కొన్ని చిన్న చిన్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా పెద్దగా మార్పు కానరావడం లేదు. ప్రభుత్వం మా విజ్ఞప్తిని ఆలకించి ఈ రెండు గ్రామాలను వేరే ప్రాంతానికి తరలించి పరిహారం అందించాలి. అప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

రోగాలతో బతుకుతున్నాం
ఎత్తినేని రవి, మల్యాలపల్లి, రామగుండం మండలం

తెల్లవారేసరికి పొగమంచును కప్పుకుంటున్నట్టు బూడిద మా గ్రామాన్ని కప్పేస్తోంది. ఎండా కాలంలో అయితే మరీ ఎక్కువగా ఉంటోంది. ఎన్‌టిపిసి బూడిద వెదజల్లే కాలుష్యం వల్ల గ్రామ ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. శ్వాసకోశ, చర్మ, కంటి, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారు. బూడితతో నీరు, గాలి, భూమి అంతా విషతుల్యంగా మారింది. ఎన్‌పిసి అధికారులు మంచినీరు సరఫరా చేస్తున్నా అందులో సైతం బూడిద, ఇతర కాలుష్యం కలుస్తోంది. ప్రభుత్వం మాకు ప్రత్యామ్నాయం చూపించాలి.